క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

పెదనందిపాడు: పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఉప్పలపాడులో కనుల పండువగా జరిగింది. అమ్మవారిని గ్రామస్తులు పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు సమర్పించారు.

నేటి నుంచి వేళాంగిణి మాత తిరునాళ్ల

పెదనందిపాడు: వేళాంగిణి మాత తిరునాళ్ల బుధవారం నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విచారణ గురువు ఫాదర్ ఎం.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అబ్బినేనిగుంట పాలెంలోని వేళాంగిణి మాత పుణ్యక్షేత్రంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెదనందిపాడు: గంగా పార్వతి సమేత సోమేశ్వస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని పాలపర్రులోని గంగా చతుర్భుజ అన్నపూర్ణాదేవి సమేత సూర్యేశ్వరస్వామి, గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి వార్ల పునఃప్రతిష్ట సందర్భంగా కొండకావూరి నాగభోగేశ్వర శర్మ, రామకృష్ణ శర్మ పర్యవేక్షణలో వేదపారాయణ, యంత్ర జపములు, వాస్తు పూజ, వాస్తు బలి, వాస్తు హోమం, జలాధివాసం, రుద్ర, శ్రీ, భూ, దుర్గా, ఆదిత్యాది నవగ్రహ హోమములు తదితర పూజా కార్యక్రమములు నిర్వహించినట్లు అర్చకులు నూతలపాటి సునీల్‌శర్మ తెలిపారు. సాయంత్రం కైలాస మండపారాధన, నవగ్రహ పూజలు, మూర్తి హోమం చేశారు, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ అసత్య ఆరోపణలు తగదు

పొన్నూరు(చేబ్రోలు): డ్రెయిన్ నిర్మాణం దెబ్బతిందంటూ టీడీపీ అసత్య ప్రచారం తగదని టీడీపీ నాయకులు హితవు పలికారు. పొన్నూరు పట్టణంలోని 26 వార్డులోని గాజులపాలెంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత మేజర్ డ్రైనేజీ పనులను, సైడ్ డ్రైన్ గోడల నిర్మాణ పనులను పరిశీలించారు. పట్టణ పరిధిలో నిర్మాణంలో ఉన్న సైడ్ డ్రెయిన్ గోడ దెబ్బతినటంపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. విలేకరుల సమావేశంలో పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొద్దులూరి రంగారావు, భవనం వంశీ రెడ్డి, వట్టిప్రోలు రంగారావు, ఎ.సాంబశివరావు, రుద్రపాటి ఆదిశేషు, షేక్ నయిామ్ బాషా, మండ్రు అనిత, చుండూరు వీరయ్య, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

పసుపు రైతులు సంఘటితం కావాలి

తాడేపల్లిరూరల్: దేశవ్యాప్తంగా పసుపు పండిస్తున్న రైతులందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి మద్దతు ధర వచ్చేంత వరకు పోరాడాలని గుంటూరు జిల్లా రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల రైలుపేటలో పసుపు వర్తకుల సంఘం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక ఎకరంలో పసుపు పండించడానికి రూ.రెండు లక్షలు ఖర్చు అవుతోందని, వాతావరణంలో మార్పులు రావడంతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారని, పండించిన పంటకు లక్ష రూపాయలు కూడా ధర రావడం లేదని అన్నారు.

బుధవారం దుగ్గిరాల రైలుపేట పసుపు వర్తకుల సంఘంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు ప్రతి ఒక్క పసుపు రైతు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వల్లభనేని సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు, దుగ్గిరాల మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ రైతు నాయకులు ఆళ్ల సాంబిరెడ్డి, కొర్రపోలు ఈశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

నిడమర్రు(మంగళగిరి): నగర పరిధిలోని చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తోపుడు బండ్లు అందజేశారు. నిడమర్రుకు చెందిన చిరు వ్యాపారులు యడ్ల గోపి అన్నపూర్ణ, కొండ పిచ్చయ్యలు పండ్లు, కూరగాయలు విక్రయించి జీవనం సాగిస్తుంటారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కే నిడమర్రు పర్యటనలో ఇరువురు చిరు వ్యాపారులు తమకు వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని తెలపడంతో తోపుడు బండ్లు అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆర్కే అందజేసిన తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లి శేషిరెడ్డి, కాటా శివయ్య, అంజిరెడ్డి, సుబ్రమణ్యం, సాంబయ్య, కొండ మునలయ్య, సాగర్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- వడ్డిముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం


గడప గడపకు మన ప్రభుత్వంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

వడ్డిముక్కల(చేబ్రోలు): ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పొన్నూరు రూరల్ మండలం వడ్డిముక్కలలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను అమలు చేయటంలో దేశంలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వడ్రాణం రవిసుధాకర్, సర్దార్, వేముల ఆనంద్, షేక్ లిల్లీబాబు, వి.నాగేశ్వరావు, పి.చిట్టిబాబు, భవనం వంశీరెడ్డి, ఆకుల వెంకటేశ్వరరావు, పెరికల కృష్ణమోహన్, అమిరినేని సాంబశివరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

వడ్డిముక్కలలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. రూ.11లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు.

నారాకోడూరులో రెండు పూరిళ్లు దగ్ధం



నారాకోడూరు(చేబ్రోలు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రెండు పూరిల్లు దగ్ధమైన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రమాదంలో గ్రామ దళితవాడ ప్రాంతానికి చెందిన కోడూరు చిన భుజంగరావు, కోడూరు సాల్మన్‌లకు చెందిన రెండు పూరిల్లు కాలి బూడిదయ్యాయి. ఘటనలో మొక్కజొన్న పంట విక్రయించగా వచ్చిన సుమారు రూ.లక్ష నగదు, పిల్లలు చదువుకునే సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలు, ఇంటి సామగ్రి, బంగారు, వెండి వస్తువులు, మంచాలు, బీరువా, బట్టలు తదితర వస్తువులన్నీ అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. సుమారు రూ.ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. రెవెన్యూ అధికారులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి నష్టం అంచనా నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరామర్శించారు. రెండు కుటుంబాలకు రూ.20వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు నరేష్, దాసరి రత్నరాజు, కోడూరి కోటేశ్వరరావు, కె.డేవిడ్ దానబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య


ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

చేబ్రోలు: పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల భవనాల నిర్మాణం సీతారామపురంలో నాలుగు ఎకరాల స్థలంలో చేపట్టనున్నట్లు వివరించారు. కళాశాలలో చదివిన 8 మంది విద్యార్థులకు వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై, ఆంపియర్ ప్రైవేట్ లిమిటెడ్, ల్యాబ్స్ అసోసియేషన్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, భవనం వంశీ రెడ్డి, అమిరినేని సాంబశివరావు, బొద్దులూరి రంగారావు, కొల్లేరు శ్రీనివాసరావు, షేక్ ఫజురుల్లా, లాజర్ బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. పొత్తూవారిపేటకు చెందిన షేక్ ఖాదర్ మొహిద్దీన్(60) ఆర్టీసీ-2 డిపోలో పనిచేశారు. అనారోగ్యంతో వీఆర్ఎస్ తీసుకున్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో గత నెల 29వ తేదీ రాజగోపాల్‌నగర్‌లో పురుగు మందు తాగారు. బంధువులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందగా, భార్య బీబీ జాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి యత్నించిన ఘటనపై కేసు

గుంటూరు ఈస్ట్: సీసీ కెమెరా వైర్లు తొలగించి ఇంట్లో చోరీకి యత్నించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. పండరీపురం ఐదోలైనులో నాగూర్ గణేష్ ఇంటికి సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు తలుపులు దగ్గరకు వేసి ఉండటంతో వాటిని తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. తొలుత టేబుల్‌పై ఉన్న సెల్‌ఫోన్ తీసుకున్నారు. నాగూర్ గణేష్, కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేసి వారి వెంట పడ్డారు. తొలుత ఓ వ్యక్తి పారిపోయాడు. రెండో వ్యక్తిని గణేష్, కుటుంబ సభ్యులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే పోలీసులు గణేష్ ఇంటికి చేరే సమయానికి రెండో వ్యక్తి కూడా తప్పించుకుని పారిపోయాడు. ఈఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల హల్‌చల్

పట్నంబజారు: పుట్టిన రోజు పేరుతో యువకులు హల్‌చల్ చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని గాంధీబొమ్మసెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి కొంత మంది యువకులు ఓ యువకుడి పుట్టిన రోజు నేపథ్యంలో కేక్‌కట్ చేసి హడావుడి చేశారు. భయాందోళనతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

మంగళగిరి: మద్యం మత్తులో తనపై ముగ్గురు యువకులు రాళ్లతో ఓ యువకునిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన పులి కిరణ్ అలియాస్ ఉదయ్‌కుమార్ నగరంలోని రాయల్ గ్యాస్ కంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి గుంటూరు నుంచి సిలిండర్ల లోడు లారీలో నగరంలోని ఆర్టీసీ డిపో రోడ్డులో గల గ్యాస్ గోడౌన్‌కు రాగా అదే సమయంలో రోడ్డుపై కూర్చొని మద్యం సేవిస్తున్న పాత మంగళగిరికి చెందిన డి వెంకటేష్ అలియాస్ నాని తన ఇద్దరు స్నేహితులతో కలసి కిరణ్‌పై రాళ్లతో దాడికి పాల్పడగా గాయాలయ్యాయి. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచిత శిక్షణ

ఫిరంగిపురం: స్థానిక గాలిబాలి మినీ స్టేడియంలో మంగళవారం సీయాప్‌సీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఫుట్‌బాల్ ఆటలో ఉచిత శిక్షణ కార్యక్రమం రిటైర్డ్ పీడీ హృదయరాజు ప్రారంభించారు. క్రీడాకారులకు కోచ్‌లు వి.నాని, వి.చరణ్‌లు శిక్షణ ఇచ్చారు. 40రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు.

అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

కమిషనర్ కీర్తి చేకూరి


బిల్డింగ్ ప్లాన్ పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే చేపట్టాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. పెద్ద పలకలూరు రోడ్, గుజ్జనగుండ్ల తదితర ప్రాంతాల్లో ఎన్‌ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాలను మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెట్ బ్యాక్ పోర్షన్ లో, రోడ్ వైడినింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలని కోరారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలని చెప్పారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ఆమె వెంట డెప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, ఏసీపీ బాబూరావు, టి.పి.ఎస్.లు గోవర్ధన్, హృదయ రాజు పాల్గొన్నారు.

వీధి దీపాల మరమ్మతులకు చర్యలు

నెహ్రూ నగర్: నగరంలో వారం రోజులపాటు వీధి దీపాలపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు, విద్యుత్ లైన్ ఉండి స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగని వాటిని వెంటనే పునరుద్ధరించనున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్తంభాలు ఉండి లైట్లు వెలగకుంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103, 104 నంబర్లకు లేదా 9849908391 నంబర్‌కు వాట్సాప్ చేయవచ్చని చెప్పారు. క్షేత్ర స్థాయిలోని నగరపాలక సంస్థ లైన్‌మెన్‌లు తమ పరిధిలో వీధి దీపాల పై నివేదిక ఇవ్వాలని, విద్యుత్ విభాగం ఏఈ, డీఈఈ, ఈఈలు పెట్రోలింగ్ చేసి, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని ఆదేశించారు.

సమాజంలో స్త్రీ, పురుషులూ సమానమే


మాట్లాడుతున్న న్యాయవాది పద్మవల్లి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానులేనని ప్రముఖ న్యాయవాది జి.పద్మవల్లి పేర్కొన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో 'మహిళలు-పురుషులు ఇద్దరూ సమానమే'' అనే అంశంపై సభ నిర్వహించారు. పద్మవల్లి మాట్లాడుతూ స్త్రీ, పురుషులకు ఒకరిని ఒకరు గౌరవించుకునే తత్త్వం అలవడాలని అన్నారు. సమాజం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ స్త్రీ వివక్షతకు గురవుతోందని, ఎన్నో కష్టాలు, బాధలు సహిస్తోందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో మహిళల జీవితం భయానకంగా ఉంటోందని తెలిపారు. జీవితంలో ఇద్దరూ ఉంటేనే ప్రయాణం ముందుకు సాగుతుందని, ఏ ఒక్కరూ వెనుకడుగు వేసినా, ఏ ఒక్కరిని కించ పరచినా సమాజ గమనానికి విఘాతం కలుగుతుందన్నారు. ఈసందర్భంగా న్యాయ వ్యవస్థలో ఉన్న సెక్షన్‌లన్నింటినీ వివరించి, ప్రతి ఒక్కరూ వీటిని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితా దేవి, మహిళా విభాగ సభ్యులు ఆర్.జయ శైలజ, ఎస్కే జమ్రుద్ బేగం, అన్నపూర్ణ, వినీలా స్టాలిన్, మణి, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా దార్శనికులు ఉపాధ్యాయులే

పారిశ్రామికవేత్త బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి



మాట్లాడుతున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏ దేశ సమగ్రాభివృద్ధిలోనైనా విద్య ప్రధాన భూమిక పోషిస్తోందని, సమాజ గతిని మార్చగల చోదక శక్తి ఉపాధ్యాయులేనని పారిశ్రామికవేత్త డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం చంద్రమౌళినగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ(స్టెప్) సంయుక్త ఆధ్వర్యంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, భాష్యం విద్యాసంస్థల సహకారంతో 'టీచర్స్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం'ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుడు బోధనకే పరిమితమవుతాడని, ఉత్తమ ఉపాధ్యాయుడు పిల్లల మదిలో కలకాలం గుర్తుండేలా స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కనుచూపు మేరలో వస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల విజయాలకు శ్రమ, నిజాయితీ, అంకితభావాలే కొలమానాలని వివరించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లు దేశభక్తితో పాటు సమాజంపై బాధ్యతలు నేర్పగలిగితే దేశం గర్వించదగ్గ పౌరులుగా విద్యార్థులు రాణిస్తారని వివరించారు. దేశ నిర్మాణ గతిని మార్చటానికి ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమంలో 400 మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. సభకు అధ్యక్షత స్టెప్ అధ్యక్షుడు ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్టెప్ అధ్యక్షుడు ప్రత్యూష సుబ్బారావు, మానవతా చైర్మన్ పావులూరి రమేష్, భాష్యం హనుమంతరావు, నల్లమోతు రామారావు, సాంబశివరావు డాక్టర్ మోహన్ భాస్కర్, డాక్టర్ స్వప్న, వెంకటేశ్వర రెడ్డి, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు అనిల్ పాల్గొన్నారు.

లాలాపేట పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ


ఫింగర్ ప్రింట్ పరికరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, పక్కన సీఐ సుబ్బారావు

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ మంగళవారం లాలాపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తొలుత పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ ఎం.సుబ్బారావును ఆదేశించారు. రాత్రి సమయంలో నైట్ డ్యూటీలు నిర్వహిస్తున్న సిబ్బంది కచ్చితంగా ఫింగర్ ప్రింట్ డివైజ్ పరికరాన్ని వినియోగించుకుని, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని ఆదేశించారు. ఎస్పీతో పాటు ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నాచికెట్ షెల్కి, ఎస్బీ సీఐ నరసింహారావు ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం


ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో పూర్వ, ప్రస్తుత జియాలజీ విభాగాధిపతులు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల జియాలజీ విభాగ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల జియాలజీ పూర్వ విభాగాధిపతులు డాక్టర్ ఎ.సుబ్రహ్మణ్యం, స్వర్ణ రవికుమార్, కె.రాజేంద్రరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్న సభకు పూర్వ విద్యార్థి నరేష్ కొలిమర్ల అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి ప్రోత్సాహకాలు మరెన్నో విద్యార్థులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, అడ్వైజర్ డాక్టర్ కె.కాళిదాసు, జియాలజీ విభాగాధిపతి జాన్ సాహెబ్, అధ్యాపకులు గురుబ్రహ్మం, బాలశౌరి పాల్గొన్నారు.

చిన్నారి నర్తకులకు ఐరావతం, నంది పురస్కారాలు



నిర్వాహకులతో పురస్కారాలు పొందిన బాలత్రిపుర సుందరి, శిష్యబృందం

తెనాలి: హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అక్కడి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ఐరావతం జాతీయ అవార్డు, ఆదర్శ స్వర్ణ నంది జాతీయ అవార్డు-2023లో తెనాలి చిన్నారులు నంది, ఐరావతం అవార్డులను అందుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ నర్తకి, నృత్య గురువు డాక్టర్ చల్లా బాలత్రిపుర సుందరికి చెందిన కల్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 30 మంది శిష్య బృందం వివిధ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. కళా నిలయం అధ్యక్షుడు చేరాల ప్రకాష్, లలిత, ప్రముఖ సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఉపాధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు మాణిక్, సినీ నటీనటులు జ్యోతిరెడ్డి, రాజేందర్, కుమనన్, బలగం ఫేమ్ సత్య ఏలేశ్వరం, కర్తా నందం, ప్రముఖ జానపద పేరడి గాయని అరుణా సుబ్బారావు, ఆవునూరి నాగరాజుశర్మ తదితర పెద్దలు హాజరయ్యారు. ఇదే వేదికపై డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి దంపతులను కళా నిలయం అధినేత చేరాల ప్రకాష్ స్వర్ణ నంది, వెండి ఐరావతంతో ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు


భద్రావతి సమేత భావనారుషి స్వామి వారు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో కొలువైన భద్రావతి సమేత భావనారుషి, మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు వైభవోపేతంగా నిర్వహిస్తారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. తొలి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు కల్యాణం మహోత్సవాలు జరుగుతాయని రెండు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. గురువారం స్వామి వారి కల్యాణం, శుక్రవారం దివ్య రథోత్సవం జరగనున్నాయి.

అపార్ట్‌మెంట్ నుంచి పడి విశ్రాంత ఉద్యోగి మృతి

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని చెంచుపేటలో విషాదం నెలకొంది. ఇక్కడి జెండా చెట్టు బజారుకి చెందిన విశ్రాంత ఉద్యోగి బల్లా రామారావు(75) మంగళవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు భార్య, కుమార్తె, అల్లుడు ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఓ అపార్ట్‌మెంటులో నివసిస్తున్నాడు.

గతంలో మేడపాడులో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన రామారావు ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్‌పై కేసు

తెనాలిరూరల్: బాలికను కిడ్నాప్ చేశాడని ఓ యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామానికి చెందిన హరినాథ్ అతడి ఇంటి సమీపంలో నివసించే బాలిక(ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంటోంది) వెంట పడుతుండే వాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు యువకుడి కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. గత నెల 29న బాలిక ఇంటికెళ్లిన హరినాథ్ ఆమెను తనతో పాటు తీసుకెళ్లాడు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు చేయగా రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



తెనాలిటౌన్: చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జమ్ముల రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా శాప్ సహకారం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం వల్లభాపురం వద్ద అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో మంగళవారం గుర్తించి, యజమానికి రూ. 8 వేల జరిమానా విధించారు.